
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 12 ఫిబ్రవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106


సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	209	238
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.144	209	238

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 20.0



నల్లగొండ జిల్లా కేంద్రం హనుమాన్‌నగర్‌లో ప్రతిష్ఠించిన 18 అడుగుల హనుమాన్ ఏకశిల విగ్రహం

అభయమివ్వు.. ఆంజనేయ

అట్టహాసంగా ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ



నల్లగొండ జిల్లా కేంద్రం హనుమాన్‌నగర్‌లో 18 అడుగుల ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని కన్నులారా వీక్షించి పరవశించారు. •7లో..



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఉపాధికి దూరం చేసిన ఆధార్

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు డబ్బు చెల్లింపునకు జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా లేదా పోస్టాఫీసు ఖాతా అనుసంధానం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పలువురు కూలీలు పనులకు దూరమవుతున్నారు. ఆధార్ అనుసంధానం కాకపోవడమే అందుకు కారణంగా చెబుతున్నారు. ఆధార్ అప్‌డేట్ అనుసంధానం సకాలంలో జరగకపోవడంతో తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 52వేల మంది కూలీలు పనికి దూరమయ్యారు.

\- మోత్కూరు



ఉపాధి హామీ పనులు 2021 డిసెంబరు వరకు ప్రభుత్వ ఆధీనంలోని 'రాగా' సాఫ్ట్‌వేర్ పర్యవేక్షణలో సాగాయి. ఈ సాఫ్ట్‌వేర్‌తో కేంద్రం నుంచి విడుదలైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి ఇతర పనులకు వినియోగిస్తోంద ని కేంద్ర ప్రభుత్వం భావించింది. క్షేత్రస్థాయిలో పనులు జరగకున్నా ఉద్యోగులు తప్పుడు రికార్డులు నమోదు చేసి కూలీల పేరుతో డబ్బు స్వాహా చేసిన ఘటనలు కొన్ని చోట్ల సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నుంచి 'రాగా'కు బదులు నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌పీసీఐ) సాఫ్ట్‌వేర్ తెచ్చి ఉపాధి పనుల అజమాయిషీని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. కూలీలు ఎలాంటి పనులు చేయాలన్నా తొలుత పనిచేస్తున్న ప్రాంతాన్ని,కూలీల హాజరు,చేసిన పనుల కొలతలను సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి నేరుగా ఎన్‌పీసీఐకి పంపేలా పర్యవేక్షణ పెంచారు.

బ్యాంకు లేదా పోస్టాఫీస్ ద్వారానే చెల్లింపులు

అక్రమాలకు ఆస్కారం లేకుండా కూలీలకు ప్రతీవారం చెల్లించాల్సిన కూలి (వేతనం) బ్యాంకు లేదా పోస్టాఫీసు ద్వారా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు కూలీల ఆధార్ నంబర్, బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా నంబర్, జాబ్‌కార్డుకు అనుసంధా నం చేయాలని గ్రామీణాభివృద్ధి సంస్థలను ఆదేశించింది. తొలుత గత ఏడాది ఆగస్టు నెల వరకు గడువు విధించి, ఆ తరువాత గత డిసెంబరు 31 వరకు పొడిగించింది. అయినా ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, జాబ్‌కార్డులో, ఆధార్ ఇంటి పేర్లు సరిపోలకపోవడం, వేలి ముద్రలు నమోదుకాకపోవడం, కొత్తగా పెళ్లయిన వారికి వధువు ఆధార్‌కార్డు ఆమె తల్లిదండ్రుల రేషన్‌కార్డుకు లింకై ఉండటం తదితర కారణాలతో కొందరు కూలీల ఆధార్ అనుసంధానం పూర్తి కాలేదు. దీంతో ఆధార్ అనుసంధానం కాని కూలీలను ఉపాధి సిబ్బంది పనికి రానివ్వడం లేదు.

ప్రోత్సాహకాలు రద్దు

ఉపాధి హామీ పనులు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనం లో నడిచినప్పుడు వేసవిలో పని కష్టమని ఫిబ్రవరి, మార్చి నెలల్లో 20శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం, జూన్‌లో 20శాతం అదనంగా కూలి ఇచ్చేవారు. లీటర్ నీటికి రూ.2చొప్పున రోజుకు ఐదు లీటర్ల తాగునీటికి రూ.10, గడ్డపార మొన పెట్టించేందుకు రూ.10, మేట్లకు రూ.20 అలవెన్సుగా ఇచ్చేవారు. నీడ కోసం టెంట్లు వేసేవారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుని అవన్నీ రద్దుచేసింది. ప్రభుత్వం నిర్దేశించిన లెక్కల ప్రకారం పని చేస్తే కూలీకి ప్రతి రోజు రూ.272 ప్రభుత్వం చెల్లిస్తుంది. గతంలో యాదాద్రి జిల్లాలో సగటు కూలి రూ.110 కాగా, ఇప్పుడు సగటు కూలి రూ.180గా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

గ్రూపులు లేకపోవడంతో...

గతంలో పని చేస్తున్న కూలీలను 20మందికి ఒక గ్రూపుగా విభజించి పని చేయించేవారు. ఒక్కో గ్రూ పునకు ఒక మస్టర్ ఉండేది. ఇప్పుడు ఒక చోట ఎం తమంది (100-150మంది) పనిచేసినా ఒకే గ్రూపు గా పరిగణించి, ఒకే మస్టర్ రాస్తున్నారు. అక్కడ పని చేసే కూలీల్లో ఒక్కరి ఆధార్ అనుసంధానం కాకపోయినా మిగతా కూలీలందరి వేతనం నిలిచిపోతుంది. ఈ కారణంగా ఆధార్ అనుసంధానం చేయని కూలీలను పనిలోకి రానివ్వడం లేదు.

నీడలేదు, నీళ్లు లేవు



పనిచేసే చోట గతంలో నీడ కోసం టెంట్లు వేసేవారు. ఇప్పుడు టెంట్లు వేయడం లేదు. ఎండలో పని చేసి అలిసిపోతే కొంత సేపు సేదదీరుదామంటే నీడ ఉండటం లేదు. చెట్లు లేని చోట నీడ లేక ఎండలోనే కూర్చోవల్సి వస్తోంది. గతంలో తాగునీటికి రోజుకు రూ.10చొప్పున ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. ఫిల్టర్‌నీళ్లు మాడబ్బుతోనే కొనుగోలుచేసి తాగుతున్నాం. గతంలో మాదిరిగా తాగునీటికి డబ్బు ఇవ్వాలి.

\- చంద్రమ్మ, ఉపాధి కూలీ, ముశిపట్ల

పేస్లిప్‌లు ఇవ్వడం లేదు



గతంలో పేసిప్ ఇచ్చేవారు. వాటితో ఏ రోజు ఎంత కూలి వచ్చిందనేది తెలిసేది. ఇప్పుడు పేస్లిప్ ఇవ్వడం లేదు. రెండు, మూడు వారాలకు కలిపి కూలి మొత్తం ఒకే సారి ఖాతాలో వేస్తుండటంతో ఏ రోజు ఎంత కూలి పడిందన్నది తెలియడం లేదు. గడ్డపార మొన పెట్టించడానికి డబ్బు ఇవ్వకపోవడంతో వచ్చే కూలి నుంచే రోజుకు రూ.10నుంచి రూ.15 గడ్డపార మొన పెట్టించేందుకే ఖర్చవుతోంది. పేస్లిప్‌లు ఇవ్వడంతో పాటు గడ్డపార మొన పెట్టించడానికి గతంలా డబ్బు ఇవ్వాలి. వేసవిలో భూమి గట్టిగా ఉండి తవ్వకం పనులు ఎక్కువ జరగవు. కాబట్టి వేసవిలో అదనపు కూలి ఇవ్వాలి.

\- బుషిపాక హనుమయ్య, కూలీ, ముశిపట్ల

ఉమ్మడి జిల్లాలో 52,405 మంది దూరం

వివిధ కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం కాక 52,405 మంది పనికి దూరమయ్యారు. నల్లగొండ జిల్లాలో 7,61,615 మంది కూలీలు, సూర్యాపేట జిల్లాలో 5,74,401 మంది, యాదాద్రి జిల్లాలో 2,60,913 మంది కూలీలు ఉన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో నల్లగొండ జిల్లాలో 25,299 మంది, సూర్యాపేట జిల్లాలో 19,226 మంది, యాదాద్రి జిల్లాలో 7,880 మంది కూలీల జాబ్‌కార్డులకు ఆధార్ కార్డులు అనుసంధానం జరగక పనులకు దూరమయ్యారు. వ్యవసాయ పనులు ముగిసినందున ప్రస్తుతం కూలీలకు ఉపాధి హామీ (కరువు)పనులే ఆదాయవనరు. ఆధార్ అనుసంధానం జరగక పనిలోకి రానివ్వకపోవడంతో తాము ఉపాధి కోల్పోయామని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా, ఇది నిరంతర ప్రక్రియ అని, ఆధార్ అప్‌డేట్ చేయించుకుని జాబ్‌కార్డుకు లింక్ చేయించుకున్నట్టయితే వెంటనే పనిలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

మహిళల ఆర్థిక భరోసాకు ఉపాధికార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

ఆర్‌అండ్‌బీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11: మహిళల ఆర్థిక భరోసా కోసం ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో వివిధ వృత్తులతో రూపొందించిన చేతి ఉత్పత్తుల శిక్షణ, ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో పురుషుల సంపాదన ఒక్కటే కుటుంబానికి సరిపోదని, మహిళలూ ఆదాయం వచ్చే పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వారికి చేదోడుగా నిలిచి ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఉమ్మడి జిల్లాలో వృత్తులతో ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.30కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లకు ఇటీవలే శ్రీకారం చుట్టామన్నారు. అలాగే నియోజకవర్గంతో పాటు, జిల్లాలోని మహిళలందరికీ ప్రత్యేకించి స్వయం సహాయక మహిళలకు వివిధ వస్తువుల తయారీలో శిక్షణ ఇస్తామన్నారు. తనతో పాటు, ప్రభుత్వపరంగా, అలాగే దాతల సహకారంతో మహిళలకు ఆదాయాన్నిచ్చే కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, ఇప్పటి వరకు 17కోట్ల మంది దీన్ని వినియోగించుకున్నారన్నారు. రెండు నెలల్లో గృహలక్ష్మి పథకం అమలులోకి రానుందని, మరో 10, 15 రోజుల్లో రూ.500లకే ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ల పథకం తీసుకురానున్నమని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ వ్యర్థాలతో టీకప్పులు తయారుచేసే యంత్రానికి అవసరమైన రూ.15లక్షలను తన సొంత నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ, మహిళలు స్వయంగా ఆర్థికంగా బలపడాలన్నారు. జిల్లాలో మహిళా స్వయం సహాయక బృందాల కార్యక్రమాలు చురుకుగా నిర్వహిస్తున్నామని, మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కొక్కరుగా కాకుండా గ్రూపుగా నిర్వహించాలన్నారు.

మహిళలు చేపట్టే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యంతోపాటు, బైబ్యాక్ విధానంలో విక్రయించేందుకు చాలా విధానాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో నిమ్మ, మిల్లెట్స్‌లాంటి వాటిపై ఎక్కువ ఉత్పత్తులు చేపడితే వాటికి మంచి మార్కెట్ ఉందని తెలిపారు. టీటీడీసీలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలో వివిధ వ్యర్థాలతో మహిళలు తయారుచేసిన సుమారు 20రకాల వస్తువులు ప్రదర్శించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, డీఆర్డీవో కాళిందిని, ఆర్డీవో రవి పాల్గొన్నారు.

ఖోఖో మహిళల విజేత మనోళ్లే



ఖోఖో మహిళా విజేత ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రస్థాయి 56వ సీనియర్స్ ఖోఖో మహిళా విజేతగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు నిలవగా, పురుషుల విజేతగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలిచింది. మూడు రోజులుగా జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. •6లో..

• కేసీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన



జిల్లా కేంద్రంలోని చర్లపల్లి బైపాస్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.

ఉమ్మడి జిల్లాలో 55మంది ఎంపీడీవోల బదిలీ

● పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థాన చలనం

నల్లగొండ, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీగా ఎంపీడీవోలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన ఎంపీడీవోలు ఈనెల 13లోగా వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 55మంది ఎంపీడీవోలకు స్థానచలనం కలిగింది. నల్లగొండ జిల్లాలో 28మందిని, యాదాద్రి జిల్లాలో 14మంది, సూర్యాపేట జిల్లాలో 13మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు.

ఎంపీడీవో	బదిలీ జిల్లా
నల్లగొండ జిల్లాలో..	
బి.యాకుబ్	యాదాద్రి
కే.రమేష్‌దీన్‌దయాళ్	సూర్యాపేట
పి.జాన్సీలక్ష్మిబాయి	యాదాద్రి
బి.లాజర్	సూర్యాపేట
పీవీఎస్‌ఆర్‌కే శర్మ	సిద్ధిపేట
డి.జితేందర్‌రెడ్డి	యాదాద్రి
ఖాజా అజ్‌ఘర్ అలీ	సూర్యాపేట
కె.శేషుకుమార్	సూర్యాపేట
జి.లక్ష్మి	సూర్యాపేట
పి.సునీత	సూర్యాపేట
జె.రాములునాయక్	జోగులాంబగద్వాల్
కె.గిరిబాబు	సూర్యాపేట
కె.ప్రమోద్‌కుమార్	యాదాద్రి
ఎ.దేవిక	యాదాద్రి
జె.వెంకటేశ్వర్‌రావు	సూర్యాపేట
జి.బాలకృష్ణ	సూర్యాపేట
వై.శ్రీనివాస్‌రెడ్డి	యాదాద్రి
డి.సోమసుందర్‌రెడ్డి	సూర్యాపేట
వై.హరికృష్ణ	జోగులాంబగద్వాల్
పి.మహేందర్‌రెడ్డి	సంగారెడ్డి
ఎంఎం.షరీఫ్	సంగారెడ్డి
ఎల్.రాజు	ఖమ్మం
ఎస్.సుధాకర్	సంగారెడ్డి
జి.యాదగిరి	సంగారెడ్డి
ఆర్.బాస్కర్	యాదాద్రి
సూర్యాపేట జిల్లాలో..	
ఆర్.సరోజ	నల్లగొండ
ఎం.ఎర్రయ్య	ఖమ్మం
ఎండీ.ఇసాక్‌హుస్సేన్	నాగర్‌కర్నూల్
బీ.శ్రీనివాసరావు	నల్లగొండ
పి.శంకరయ్య	యాదాద్రి
కె.ఉమేష్‌చారి	నల్లగొండ
ఎం. ఇందిర	యాదాద్రి
ఎల్.మల్‌సూర్	సంగారెడ్డి
ఎ.జానయ్య	నారాయణపేట్
కె.ఇద్దయ్య	భద్రాద్రికొత్తగూడెం
ఎల్.లక్ష్మి	నల్లగొండ
బి.వెంకటేశ్వర్లు	ఖమ్మం
టి.వెంకటాచారి	వనపర్తి
యాదాద్రి జిల్లాలో..	
పి.జ్ఞానప్రకాష్‌రావు	నల్లగొండ
ఈ.వీరస్వామి	మహబూబాబాద్
ఎల్.చంద్రమౌళి	నల్లగొండ
లెంకల గీతారెడ్డి	మేడ్చల్‌మల్కాజ్‌గిరి
కె.ప్రభాకర్‌రెడ్డి	వికారాబాద్
ఎ.రాములు	జనగాం
యు.శ్రీవాణి	రంగారెడ్డి
ఎ.బాలశంకర్	రంగారెడ్డి
బి.సరిత	రంగారెడ్డి
జి.జలేందర్‌రెడ్డి	జనగాం
ఉమాదేవి	జనగాం
బి.యాదగిరి	సిద్దిపేట
జి.శ్రీనివాసులు	జనగాం
జి.నరేందర్‌రెడ్డి	రంగారెడ్డి

పశుసంవర్ధక శాఖలో మ్యూజికల్ చైర్

» ఆసక్తి కలిగిస్తున్న అధికారుల కుర్చీల ఆట » నెలల వ్యవధిలో ముగ్గురు అధికారుల మార్పు » పథకాల అమలుపై తీవ్ర ప్రభావం

నల్లగొండ, ఫిబ్రవరి 11: కొన్నాళ్లుగా పశుసంవర్ధక శాఖలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన విచిత్ర పోకడలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మారలేదు. ఆ శాఖలో జరుగుతున్న మార్పులు మ్యూజికల్ చైర్(కుర్చీల ఆట)ను తలపిస్తోంది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు జిల్లా పశుసంవర్ధకశాఖలో తరచూ మార్పులు చేస్తుండటంతో పథకాల అమలుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అసలు ఎందుకు ఈ మార్పులో అర్థం కావడం లేదు. నెలల వ్యవధిలో ముగ్గురు అధికారులను మార్చారు. ఈ ముగ్గురు సైతం సీనియర్ అధికారులే అయినా, వారిని మార్చడంతో ఆయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. శాఖలో రాజకీయ జోక్యం కూడా ఎక్కువైనట్టు వినికిడి. రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయంతో ఉన్న వారికి పోస్టింగ్, లేదంటే తప్పిస్తున్నారని శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

పలు ఆరోపణలతో ఒకరి మార్పు

పశుసంవర్ధకశాఖలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కంటే ఆ



శాఖలో ఉద్యోగుల్లో కుర్చీల ఆట చర్చనీయాంశమైంది. ఓ అధికారి గత ప్రభుత్వ హయంలో గొర్రెల యూనిట్ల పథకాను

రిటైర్ కాబోతున్నందున నియమించారేమో

నేను ఏప్రిల్ మాసంలో ఉద్యోగ విరమణ చేయనున్నా, నా ఒరిజినల్ పోస్టు నల్లగొండలోనే అయినందున ఇక్కడే ఉద్యోగ విరమణ చేయాలని నియమించారేమో. అంతే తప్ప నాకు ఏమి తెలియదు. గతంలో ఇద్దరు అధికారులను నియమించి ఆ తరువాత వారిని తప్పించి నన్ను ఎందుకు నియమించారనేది తెలియదు. వారిని ఎందుకు తప్పించారనేది కూడా నాకు సమాచారం లేదు.

\- ఎంవీ.సుబ్బారావు, పశుసంవర్ధశాఖ జేడీ

అమలు చేయడంలో వైఫల్యం చెందడంతో పాటు సంబంధిత శాఖలో అధికారులు, ఉద్యోగులతో సమన్వయం లేకుండా వ్యవహరిస్తుండటంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఓ కీలక ప్రజాప్రతినిధి దృష్టికి సదరు సారు నిర్లక్ష్య వైఖరిని శాఖ ఉద్యోగులు తీసుకెళ్లడం అప్పట్లో చర్చనీయాంశమైంది. దీంతో ఆయన్ను ఉన్నతాధికారి పోస్టు నుంచి తప్పించి మరో సీనియర్ ఏడీఏకు జిల్లా పశుసంవర్ధశాఖ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. సదరు సార్ చండూర్‌లో పనిచేసినప్పుడు ఓ స్థలం ఫైల్ విషయంలో వివాదంలో కూడా చిక్కుకున్నాడు. ఇప్పటి వరకు ఆ ఫైల్ జాడ లేదు. దాని కోసం పలుమార్లు ఉన్నతాధికారులు విచారణ చేసినా నేటికీ దొరకలేదు. చండూర్‌లో పశుసంవర్ధకశాఖకు ఓ వెంచర్ నిర్వాహకులు కొంత స్థలాన్ని ఇచ్చాడు. ఆ తరువాత భూమి ధరలు పెరగడంతో ఆ స్థలం యజమానులు ఇచ్చిన స్థలాన్ని కూడా విక్రయించినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేసి ఫైల్ పంపించాల్సిన అధికారి నిర్లక్ష్యం చేశారు. ఈ విషయాన్ని చండూర్ జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధి ఒకరు పలుమార్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అప్పటి కలెక్టర్ విచారణకు ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేయగా, ఇప్పటి వరకు ఎటూ తేలలేదు. సదరు సార్‌పై ఇలాంటి ఆరోపణలు చాలా ఉండటంతో ఆయన్ను ఉన్నతాధికారి పోస్టు నుంచి తప్పించారు.

ఏ క్షణాన ఎవరిని తప్పిస్తారో?

పశుసంవర్ధక శాఖలో ప్రధానంగా గొర్రెల యూనిట్ల పంపిణీతోపాటు పశుసంపదను పెంచడం, చికిత్సలు అందించడం, వ్యాధి నిరోధక టీకాలను ఇవ్వడం చేయాలి. ఈ శాఖ అధికారులు జిల్లాలో పనిచేయాలంటే రాజకీయ నాయకులతో సమన్వయంతో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్ది రోజులుగా కొన్ని పథకాలకు సంబంధించి బిల్లుల వ్యవహారం కూడా వివాదాస్పదమైంది. అప్పట్లో ఏడీఏకు జేడీగా బాధ్యతలు అప్పగించి కొన్ని వివాదాలు తలెత్తడంతో తప్పించిన అనంతరం, మరో సీనియర్ అధికారికి జేడీఏగా బాధ్యతలు అప్పగించారు. ఆ అధికారి గతంలో గొర్రెల యూనిట్ల పథకం అమలును వేగవంతం చేశారు. దీంతో అనుభవం ఉన్న అధికారికి మళ్లీ బాధ్యతలు అప్పగించినా గొర్రెల యూనిట్ల పథకం రెండో సారి అమ లు చేయడానికి సన్నాహాలు చేయడంతో పాటు అనర్హులను స్క్రూట్నీ లో తొలగించే ప్రక్రియను కూడా చేపట్టారు. స్కీంను గాడిలో పెడుతు న్న సమయంలో అంతలో ప్రభుత్వం మారింది. గత 15 రోజుల క్రితం ఆ అధికారిని బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. 2021లో హైదరాబాద్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిన సుబ్బారావును ఇక్కడి జేడీగా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏప్రిల్ నెలలో ఆయన పదవీ విరమణ పొందనున్నారు. మొదట జేడీగా బాధ్యతలు చేపట్టిన అధికారి కూడా త్వరలోనే పదవీ విరమణ చేయనున్నారు. సీనియర్ అయినా బాధ్యతల నుంచి ఎందుకు తప్పించారో తెలియడం లేదు.

శాఖలో కోల్డ్‌వార్

జిల్లా పశుసంవర్ధక శాఖలో ఉన్నతాధికారులు, డాక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. గతంలో ఓ అధికారి కిందిస్థాయి ఉద్యోగులను వేధింపులకు గురిచేశారని ఆరోపణలు వెలువెత్తాయి. పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా దానిపై విచారణ లేదు. గొర్రెల యూనిట్ల పథకం అమలులో అధికారులు, ఉద్యోగుల మధ్య విభేదాలు పొడచూపాయి. బిల్లుల చెల్లింపు విషయంలో సమస్యలు వచ్చినట్టు వినికిడి. గొర్రెల రీసైక్లింగ్ విషయంలో కొంత మంది డాక్టర్ల పాత్ర కూడా ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో కేసులు కూడా నమోదవ్వగా, చాలా కేసులు కొలిక్కి రాకుండా కొందరు అడ్డుపడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

● నిత్య ఆదాయం రూ.53.48లక్షలు



నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మేడారం జాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదగిరీశుడిని దర్శించుకోవడం ఆనవాయితీ. సుముహూర్తాలు ఆరంభమవగా, క్షేత్రాన్ని సందర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ప్రధానాలయం, తిరువీధులు, సేవామండపాలు సందడిగా కన్పించాయి. ధర్మదర్శనాల్లో మూడు గంటలు, ప్రత్యేక దర్శనాలకు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 45వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్య విధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో, శివాలయంలో రామలింగేశ్వరుడికి స్మార్త సంప్రదాయరీతిలో నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు బిందెతీర్థంతో నిత్య పూజలు ఆరంభించి రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవంతో ఆలయ ద్వార బంధనం చేశారు. స్వామి వారికి అమెరికాకు చెందిన చెరుకూరి శైలేంద్ర, రాధిక దంపతులు సుమారు 990గ్రాముల బరువు ఉన్న రెండు వెండి కలశాలను కానుకగా అందజేశారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులకు హైదరాబాద్ ఏఎస్.రావ్‌నగర్‌కు చెందిన ఎస్.ల్యాబ్స్, క్రిష్‌మెడ్స్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భక్తులు పరీక్షలు చేయించుకున్నారు. కాగా, వివిధ విభాగాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.53,48,668 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు.

ఖోఖో మహిళల విజేత
ఉమ్మడి నల్లగొండ జట్టు

● ముగిసిన 56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు



ఫైనల్స్‌లో పోటీ పడుతున్న నల్లగొండ, రంగారెడ్డి జట్లు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 11: తెలంగాణ 56వ సీనియర్స్ ఖోఖో మహిళా విజేతగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు నిలవగా, పురుషుల విజేతగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలిచింది. ఈ మేరకు మూడు రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న 56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలు ఆదివారం ముగిశాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్స్‌లో నల్లగొండ జట్టు రంగారెడ్డి జిల్లాపై 9-7పాయింట్ల తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తృతీయ, హైదరాబాద్ జట్టు చతుర్థ స్థానంలో నిలిచాయి. పురుషుల ఫైనల్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రంగారెడ్డి జిల్లాపై 22-21 పాయింట్ల తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. తృతీయ, చతుర్థ స్థానంకోసం జరిగిన పోటీలో వరంగల్, హైదరాబాద్ జట్ల మ్యాచ్ టై కావడంతో ఆ రెండు జట్లను తృతీయ స్థానాన్ని సమష్టిగా పంచుకున్నాయి. నల్లగొండ పురుషుల జట్టు 9వ స్థానంలో నిలిచింది. మహిళా జట్లు విజేతకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పురుషుల జట్టు విజేతకు అదనపు కలెక్టర్ వీరారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో క్రీడా సౌకర్యాలను మెరుగుపర్చే లక్ష్యంతో పట్టణ శివారులోని రాయిగిరిలో 10ఎకరాల విస్తీర్ణంలో రూ.100కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు.

ముగిసిన ఛాంపియన్ షిప్ పోటీలు

56వ తెలంగాణ సీనియర్స్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 20 మహిళల, పురుషుల జట్లకు చెందిన 300 మంది క్రీడాకారులు 48 మ్యాచ్‌లు ఆడారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి కె ధనంజనేయులు, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనాథ్, టోర్నీ చైర్మన్ ఏదునూరి మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, డీఏవో మందడి ఉపేందర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జలేందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ స్టాలిన్ బాబు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్ ఉన్నారు.

టోర్నీలో జట్ల స్థానాలు ఇలా..

మహిళల జట్లు: నల్లగొండ(1వ), రంగారెడ్డి(2వ), మహబూబ్‌నగర్ (3వ), హైదరాబాద్ (4వ), అదిలాబాద్ (5వ), కరీంనగర్ (6వ), మెదక్ (7వ), వరంగల్ (8వ), ఖమ్మం (9వ), నిజామాబాద్ (10వ) స్థానంలో నిలిచాయి.

పురుషుల జట్టు : కరీంనగర్ (1వ), రంగారెడ్డి (2వ), వరంగల్, హైదరాబాద్ (సంయుక్తంగా 3వ), మెదక్ (5వ), ఖమ్మం (6వ), మహబూబ్‌నగర్ (7వ), అదిలాబాద్ (8వ), నల్లగొండ (9వ), నిజామాబాద్ (10వ) స్థానంలో నిలిచాయి.



కరీంనగర్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

చాక్లెట్లు ఆశ చూపి చిన్నారికి బెదిరింపులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 11: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని చింతబండ వద్ద శనివారం సాయంత్రం ఓ చిన్నారికి చాక్లెట్లు ఆశచూపి బెదిరించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చింతబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చిన్నారి సాయంత్రం 4గంటల తర్వాత పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా ఓ అగంతకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి చాక్లెట్ ఇస్తా అని చెప్పడంతో చిన్నారి తీసుకోకుండా మొండికేసింది. ఎందుకు తీసుకోవు అంటూ బెదిరిస్తుండడంతో చిన్నారికి భయం వేసి రహదా రి పక్కన ఉన్న ఇంట్లోకి పరిగెత్తింది. ఆ ఇంట్లో ఉన్న వారికి విషయం చెప్పడంతో వారు బయటకు వచ్చే సరికి అగంతకుడు ఉడాయించాడు. బైక్‌పై వచ్చిన వ్యక్తి టీషర్ట్ ధరించి, నిక్కరు వేసుకొని ఉన్నాడని చిన్నారి తెలిపింది. పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో జరిగిన ఈ ఘటనతో అంతా ఉలిక్కిపడ్డారు. చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని స్థానికులు తెలిపారు. పై విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

కన్నుల పండువగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ


ఆంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 11: జై శ్రీరామ్.. జై హనుమాన్ భక్తుల నినాదాలు.. హర్షధ్వానాల నడుమ 18అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. జిల్లా కేంద్రంలోని పాత బస్తీ హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అంజనేయస్వామి ఆలయం ప్రారంభం, స్వామివారి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ చూడముచ్చటగా సాగింది. ఉదయం రుత్వికుల వేదమంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు యంత్ర ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు, జిల్లా అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ప్రతిష్ఠా మహోత్సవాన్ని కనులారా తిలకించి పరవశులయ్యారు. అనంతరం అర్చక స్వాములు సువర్చల సమేత అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరు రాజయ్య, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, సతీష్, గార్లపాటి వెంకటయ్య, కంది సూర్యనారాయణ, రాంరెడ్డి, యాదగిరి, అబిమన్యు శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, చాడా కిషన్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందువుల ఆకాంక్ష నెరవేరింది : కిషన్‌రెడ్డి

పలు పోరాటాల అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠతో హిందువుల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అంజనేయ స్వామి ఆలయం, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అంజనేయస్వామి దేవాలయం ఒక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజయ్య, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, గుండబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.25లక్షలు : వెంకట్‌రెడ్డి

విగ్రహదాతగా ఉండటం తన అదృష్టమని, ఆలయ అభివృద్ధికి మరో రూ.25లక్షలు కేటాయిస్తున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ హరిచందనతో కలిసి పూజల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయానికి వచ్చేభక్తులకు ఇబ్బంది కలగకుండా ఘాట్ రోడ్ నిర్మాణం, గాలిగోపురం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రవి, గుమ్మల మోహన్ రెడ్డి, అబ్బగోని రమేష్, తదితరులు పాల్గొన్నారు.


సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్న భక్తులు


స్వామివారికి మొక్కుతున్న భక్తులు



స్వామివారికి మొక్కుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, వేడుకల్లో పాల్గొన్న భక్తులు

వారం రోజుల్లో వివాహం..
అంతలోనే విషాదం

శుభలేఖలు పంచి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి


శివకుమార్ (ఫైల్)

నార్కట్‌పల్లి, మోత్కూరు, ఫిబ్రవరి 11: వారం రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన ఓ యు వకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పు మోగింది. శనివారం రాత్రి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన సకినాల వెంకట య్య. ఉమారాణి దంపతులకు రైస్‌మిల్లు, కిరాణా దుకాణం ఉన్నాయి. ముగ్గురు కుమారులు కాగా, ఇద్దరికి వివాహాలు అయ్యాయి. వెంకట య్య కిరాణా దుకాణం నిర్వహిస్తుండగా, కుమారులు రైస్ మిల్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. మూడో కుమారుడు శివకుమార్(26)కు హైదరాబాద్‌కు చెందిన అమ్మాయితో ఈ నెల 18వ తేదీన వివాహం నిశ్చయమైంది. కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో హడావుడిగా ఉన్నా రు. వరుసకు సోదరుడైన అప్పిశెట్టి నితిన్‌కుమార్‌తో కలిసి శివకుమార్ పెళ్లి పత్రికలను పంచుతున్నాడు. శనివారం నల్లగొండలో ఉంటున్న బంధువులకు పత్రికలు పంచి ద్విచక్ర వాహనంపై తిరిగి మోత్కూరు కు బయలుదేదారు. రాత్రి 11 గంటల సమయంలో నార్కట్‌పల్లి మం డలం అమ్మనబోలు గ్రామశివారుకు చేరుకోగానే ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న శివకుమార్ తలకు బలమైన గాయాలుకాగా, వెనుక కూర్చున్న నితిన్ స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శివకుమార్‌కు ప్రాథమిక చికిత్స అందించి నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివకుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని నల్లగొండ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. శివ సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

మోత్కూరులో విషాదఛాయలు

మోత్కూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కిరాణ వ్యాపారులు దుకాణాలు మూసి వేసి సంతాపం తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో శివకుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు ఇరుకుల వెంకన్న, మొగుళ్లపల్లి సోమయ్య, బుక్క విశ్వనాథం, బుస్సా శ్రీనివాస్, సోమ వెంకటేశ్వర్లు, తిపిరిశెట్టి శ్రీనివాస్, బుస్సా రవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

ఆస్తి పంచాయితీలో దుర్భాషలాడిన తండ్రి

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీస్‌స్టేషన్ ఎదుట ఘటన

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 11: పుట్టింటి వారు పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఇంటి స్థలం కోసం ఓ మహిళ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసింది. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఈ సంఘటన జరిగింది. బాధిత మహిళ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన కదారి రామనర్సయ్యకు ఇద్దరు భార్యలు ఉన్నారు. 11 సంవత్సరాల క్రితం మొదటి భార్య కుమార్తె విజయకు వివాహం సమయంలో పసుపుకుంకుమల కింద గ్రామంలో ఉన్న ఇంటిని అప్పగించాడు. అయితే తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన ఇంటిని తండ్రి రామనర్సయ్య ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న కుమార్తె విజయ దీనిని అడ్డుకుని న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించింది. అక్కడ న్యాయం జరగకపోవడంతో గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు గ్రామ పెద్ద మనుషులను ఆశ్రయించింది. ఎక్కడా తనకు న్యాయం జరగలేదని బాధితురాలు విజయ తెలిపింది. అయితే గత నెల 28వ తేదీన తన ఇంటి విక్రయంలో తన కుమార్తె విజయ అడ్డుపడుతుందని తండ్రి రామనర్సయ్య మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించేందుకు రూరల్ పోలీసులు విజయను ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ తీర్మానం చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పాత వ్యవసాయ మార్కెట్ షెడ్‌లో పంచాయితీ నిర్వహించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగగా విజయ తన తండ్రిని ఆస్తి విషయమై నిలదీసింది. మనస్తాపం చెందిన విజయ బ్లేడ్‌తో చేతి మణికట్టు వద్ద గాయం చేసుకుంది. దీంతో చేతి నరాలు తెగి తీవ్ర రక్తస్రావమవుతుండటంతో పోలీస్‌స్టేషన్‌లోకి పరుగున వెళ్లింది. దీనిని గమనించిన ఎస్ఐ సతీష్ ఆమెను చికిత్స నిమిత్తం పోలీస్ వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం చేతి స్పర్శ లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పదేళ్లుగా పుట్టింటి వారినుంచి వచ్చిన ఆస్తి కోసం పోరాడుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదని, తనకు డీఎస్‌పీ పరీక్ష నిర్వహించి పసుపు కుంకుమల కింద అప్పగించిన ఆస్తి దక్కేలా అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని విజయ కోరుతుంది. సంఘటన జరిగిన ప్రదేశం వన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో దీనిపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు విజయ

'ఆరు గ్యారెంటీలు' కంటే విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వండి

ఇమాంపేటలో విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాల ఎదుట ధర్నాలో పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

సూర్యా పేట రూరల్, ఫిబ్రవరి 11: ఎన్నికల్లో గెలవడానికి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చిన ఆరు గ్యారెంటీల కంటే రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని ఇమాంపేట గ్రామ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వైష్ణవి మృతికి రీజనల్ కోఆర్డినేటర్(ఆర్సీవో), ప్రిన్సిపాల్ కారణమంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. వారికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల హామీలు అమలుచేయకపోయినా వచ్చే నష్టమేమీలేదని, ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థినుల ప్రాణాలను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో విద్యార్థినుల ఆత్మహత్యల ఘటనను మరవక ముందే సూర్యాపేటలో విద్యార్థిని మృతిచెందడం బాధాకరమన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చింది ఇందుకేనా? అని మండిపడ్డారు. ఆదాయం వచ్చే శాఖలకు మంత్రులను కేటాయించారని, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖలకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. భువనగిరి గురుకులంలో విద్యార్థినులు మృతి చెందితే ప్రభుత్వం రెండు నిముషాలు మౌనం పాటించకపోవడం హేయమైన చర్య అని అన్నారు. ఇమాంపేట గురుకులంలో విద్యార్థిని చనిపోతే తల్లిదండ్రులకు భరోసా కల్పించడానికి మంత్రి, ఎమ్మెల్యే, సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు రాకపోవడం సిగ్గుమాలిన చర్యకు పరాకాష్ట అని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు, పాలపక్షాలు పరస్పరం తిట్టుకుంటున్నాయని, ఒకరు శ్వేత పత్రం అంటారని, మరోకరు నల్లపత్రం అంటారని, పిల్లల జీవితాల గురించి పట్టించుకునే నాథుడేలేడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లల్లో విద్యార్థినులు ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గురుకులంలో విద్యార్థినుల మనోభావాలను అర్థం చేసుకోవడానికి సైకాలజిస్టు, కౌన్సిలర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. వైష్ణవి మృతిపై ప్రభుత్వం విచారణ జరిపించి బాధ్యులను సస్పెండ్ చేయాలని, మృతురాలి కుటుంబానికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సుమారు 2.4 కిలోల గంజాయి స్వాధీనం

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 11: నిషేధిత గంజాయిని పీల్చుతూ, ఇతరులకు విక్రయిస్తున్న యువకులను సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆదివారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు చిలుకూరు పోలీసులు మండల పరిధిలోని బేతవోలు గ్రామశివారులోగల మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద ఐదుగురు యువకులు గంజాయిని తాగుతూ ఉన్నారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే బోడ సురేష్, అదే గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ బానోత్ మోహన్, అదే గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పని చేసే భూక్యా అఖిల్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు తండాకు చెందిన వ్యవసాయ పనులు చేసే ధరావత్ వినోద్, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మంగలితండాకు చెందిన ప్రైవేటు ఉద్యోగి నునావత్ సాయి, సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపారపు శ్రీకాంత్‌లు స్నేహితులు. వీరందరు కొంత కాలంగా గంజాయికి అలవాటు పడ్డారు. దీంతో ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కిలో గంజాయిని రూ.4500 కొనుగోలు చేసి వారు పీల్చడంతోపాటు సూర్యాపేట జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా నునావత్ సాయి అతడి స్నేహితుడైన వినోద్‌కు ఫోన్ చేసి బేతవోలుకు చెందిన శ్రీకాంత్‌కు తమ వద్ద గంజాయిని విక్రయిద్దామని అతడు వారి గ్రామ సమీప ప్రాంతంలో ఇతరులకు విక్రయిస్తాడని చెబుతాడు. దీంతో ఈ నెల 10వ తేదీన బోడ సురేష్, భూక్యా అఖిల్‌కుమార్, బానోత్ మోహన్ ముగ్గురు కలిసి వారి వద్ద ఉన్న సుమారు రెండు కిలోల గంజాయిని తీసుకుని సురేష్ బైక్‌పై వినోద్ వద్దకు వెళ్లి అతడి వద్ద ఉన్న సుమారు 400 గ్రాముల గంజాయిని తీసుకున్నారు. అక్కడి నుంచి నలుగురు కలిసి బేతవోలు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో బోడ సురేష్ బైక్‌పై అఖిల్, బస్సులో మోహన్, వినోద్ మునగాల మండల పరిధిలోని బరాఖత్‌గూడెం చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో బేతవోలు గ్రామ శివారులోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో గల సాయిలి నవీన్ యొక్క మామిడి తోటకు వెళ్లారు. వారు వచ్చిన విషయాన్ని శ్రీకాంత్‌కు తెలపగా శ్రీకాంత్ మామిడితోటకు వెళ్లాడు. అక్కడ ఐదుగురు కలిసి గంజాయి తాగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా వారి వద్ద సుమారు రూ.37వేల విలువైన రెండు కిలోల 400 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తాగుతూ, ఇతరులకు విక్రయిస్తున్న పైఆరుగురు యువకులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఐదుగురు యువకులను కోర్టుకు రిమాండ్‌కు తరలించగా నునావత్ సాయి పరారీలో ఉన్నాడు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, కోదాడ రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి, చిలుకూరు ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేష్, నగేష్, అలీమోద్దిన్ ఉన్నారు.


విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

అంబేడ్కర్ ఆలోచనా విధానంతో పనిచేయాలి

● ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లేషం


సమావేశంలో మాట్లాడుతున్న కత్తుల మల్లేషం

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11: అంబేడ్కర్ ఆలోచనా విధానంతో సంఘం బాధ్యులంతా పనిచేయాలని అప్పుడే తమకు రావాల్సిన హక్కులను న్యాయంగా సాధించుకోగలుగుతామని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కత్తుల మల్లేషం అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించిన షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జిల్లాలోని సంఘం బాధ్యులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. ఇటీవల కొంద రు సంఘానికి వ్యతిరేకంగా తమ వ్యక్తిగత పనులకు సంఘాన్ని ఉపయోగించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని ఆ యన హెచ్చరించారు. జిల్లాలోని అన్ని డివిజన్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అసోసియేషన్‌తో పాటు అనుబంధ సంఘమైన అంబేడ్కర్ యువజన సంఘం నూతన బాధ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కలాల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా కత్తుల జగన్‌కుమార్, మిర్యాలగూడ పట్టణ కన్వీనర్‌గా కోట విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పేరుమాళ్ల కుమారి, నల్లగొండ కన్వీనర్‌గా కట్టెల మహేష్, సూర్యాపేట డివిజన్ కన్వీనర్‌గా కత్తుల యాదగిరిని నియమించారు. అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంటేపాక యాదగిరి, పట్టణ కోకన్వీనర్‌గా మాతంగి లింగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడిగా చిల్లపూడి లక్ష్మీనర్సింహలను ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కత్తుల మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల యాదయ్య, గడ్డం సహదేవ్, కత్తుల సూర్యనారాయణ, ధైద సత్యం, కాశయ్య, నాయకులు వెంకట్, యాదగిరి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జలాల హక్కులను కాపాడటంలో విఫలం

● ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 11: కృష్ణా జలాల హక్కులను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ నెల 13వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త జాజాల సురేందర్ అన్నారు. మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కడారి అంజయ్యయాదవ్‌తో కలిసి ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణాజలాల వాటాను తేల్చకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా నాన్చివేత ధోరణికి పాల్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణాజలాల హక్కులపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా బాధ్యతను అప్పజెప్పడం తెలంగాణ రైతులను మోసం చేసినట్లవుతుందన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృష్ణా జలాలపై అవగాహన లేకుండా ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏనాడూ మాజీ సీఎం కేసీఆర్ కృష్ణా జలాలపై కేంద్రప్రభుత్వ పెత్తనాన్ని ఒప్పుకోలేదని కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో హామి ఇచ్చిన విధంగా నియోజకవర్గంలో నెల్లికల్ లిఫ్ట్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, నాయకులు బానావత్ బాబురావునాయక్, అల్లి పెద్దిరాజు, కెతావత్ భిక్ష్యానాయక్, శాగం అంజిరెడ్డి, నాగెండ్ల వెంకట్‌రెడ్డి, నాసర్‌రెడ్డి, కోటిరెడ్డి, నాసర్‌రెడ్డి, సైదులు, బాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దేవుడునాయక్, నగేష్‌నాయక్, కోటిరెడ్డి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి : అమిత్‌రెడ్డి

నల్లగొండ: కృష్ణా జలాల పరిరక్షణ కోసం ఈ నెల 13వ తేదీన కేసీఆర్ నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఆర్ఎంబీ సమావేశంలో కృష్ణా ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీ అప్పనంగా కేంద్రానికి అప్పగించిందని ఆరోపించారు. కృష్ణానది జిల్లాకు వరప్రదాయిని అని 6 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఆయువు పట్టు లాంటి కృష్ణానదిని కేం ద్రానికి అప్పగించడం వల్ల రాష్ట్రంతో పాటు జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కృష్ణాజలాలు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్తే తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. పార్టీ ఆదేశిస్తే నల్లగొండ లేదా భువనగిరి నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానన్నారు. తనకు పార్టీ నిర్ణయమే శిరోధార్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, నాయకులు అయితగాని స్వామిగౌడ్, శ్రీరామదాసు హరికృష్ణ, నాగులవంచ వెంకటేశ్వరరావు, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, మొయిజ్, సంజీవ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● **కనగల్:** నల్లగొండలో ఈ నెల 13న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొనే రైతు మహాగర్జన సభకు రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎంపీపీ కరీంపాష కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బహిరంగ సభ విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. పర్వతగిరిలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుతో కృష్ణా నీటి పంపకాల్లో తెలంగాణకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించే కుట్ర జరుగుతుందని అన్నారు. సమావేశంలో నాయకులు ఐతగోని యాదయ్యగౌడ్, కడారి కృష్ణయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, రామచంద్రం, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

● **మాడ్గులపల్లి:** కృష్ణా జలాలను కేంద్రప్రభుత్వానికి అప్పగించవద్దని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించే కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య అన్నారు.

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11: వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక సాగర్ రోడ్డులో గల వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత, విష్ణు సహస్రనామాలు, గీతాపారాయణం, గాయత్రి యజ్ఞం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఊరే జనార్ధన్, ప్రధాన కార్యదర్శి గౌరు వేంకటేశ్వర్లు, కోశాదికారి చందా ధనుంజయ్య, రాచమళ్ల నర్సింహ, తేరటిపల్లి బుచ్చిరాములు, పాంపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుంజయ వివాహ వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న ధనుంజయ పావని దంపతులు

చింతపల్లి, ఫిబ్రవరి 11: చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయ చైర్మన్ మంచికంటి ధనుంజయ పావనిల వివాహ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చింతపల్లిలోని ఆయన స్వగృహంలో కేక్ కట్ చేసిన అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, నాయకులు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ధనుంజయ గృహంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త మంచికంటి జనార్ధన్, షిర్డీ సాయిబాబా దేవాలయ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, పీఆర్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి ఎన్ఆర్ఐ విరాళం

కనగల్, ఫిబ్రవరి 11: మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి ఎన్ఆర్ఐ, బాబా డ్రిల్లింగ్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ నల్లగొండ మండలం కంచనపల్లికి చెందిన వందనపు శశికుమార్ రూ.లక్ష రూపాయల (చెక్కు) విరాళాన్ని అందజేశారు. దేవస్థానం కార్యాలయంలో ఆదివారం సీనియర్ అసిస్టెంట్లు జినుకుంట్ల చంద్రయ్య, చిలకరాజు లింగయ్యకు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్, బాబాడ్రిల్లింగ్ కంపెనీ జీఎం దేప కరుణాకర్‌రెడ్డి సలహా మేరకు ఆలయ అభివృద్ధి కోసం త్వరలోనే మరికొంత విరాళాన్ని అందజేస్తానని శశి కుమార్ తెలిపారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు ఆశీస్సులు అందజేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌కుమారాచార్యులు, మహేష్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి: సీఐటీయూ

హాలియా, ఫిబ్రవరి 11: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను రాజకీయాలకతీతంగా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు పిలుపునిచ్చారు. హాలియాలోని సుందరయ్య భవనంలో ఆదివారం సమ్మె పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నిత్యావసర వస్తువల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.కె. బషీర్, పొదిల వెంకన్న, రేవల్లి వెంకటేశ్వర్లు, కేతపల్లి సైదులు, రెడ్డిమల్ల సురేష్, కాట్నం వెంకటయ్య, కేశవ్,యాదయ్య, సైదిరెడ్డి, పేరూరు శ్రీను, సహదేవుడు, వెంకన్న పాల్గొన్నారు.

ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి : నాగరాజు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 11: రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో జరుగుతున్న విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్ రెండోరోజు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మహిళల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ వసతిగృహాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రంలో మహిళ యూనివర్సిటీ ఏర్పాటు చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. కాస్మొటిక్స్ చార్జీలు, దుస్తులు వంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మహిళ సాధికారత సాధించాలంటే చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు మమత, రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, రాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కమ్మంపాటి శంకర్, కావ్య, కుర్ర సైదానాయక్, లక్ష్మణ్‌నాయక్, వెంకటేష్, రవీందర్, జగదీష్ పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి : బంధువుల ఆందోళన


ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 11: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సకాలంలో వైద్యసేవలందక రోగి మృతి చెందిందని బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కన్నెబోయిన సోమమ్మ (63) విరోచనాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆదివారం ఉదయం ఉదయం ఆమె కుటుంబసభ్యులు ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన ఆస్పత్రి వైద్యులు సెలైన్ పెట్టి ఇంజక్షన్ ఇచ్చారు. సూది మందు ఇచ్చిన వెంటనే రోగి సోమమ్మ ఛాతిలో మంట, నొప్పిగా ఉందంటూ కేకలు వేసింది. అయినా సకాలంలో వైద్యులు స్పందించలేదని మృతురాలి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజక్షన్ వికటించడంతోనే సోమమ్మ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకొని బందోబస్తు నిర్వహించారు. అనంతరం రోగి బంధువులతో మాట్లాడి సర్దిచెప్పడంతో తమ ఆందోళన విరమించుకున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరధ్‌ను వివరణ కోరగా రోగి బీపీ లెవల్ పూర్తిగా పడిపోవడంతో ఎంతగా ప్రయత్నించినా పల్స్ రేటు సాధారణ స్థాయికి రాలేదు. వృద్ధురాలు కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుందని, మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య పరిస్థితి సహకరించక గుండెపోటు వచ్చి ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ విషయంలో ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని సూపరింటెండెంట్ తెలిపారు.

నేటినుంచి శ్రీభక్త మార్కండేయ ఆలయంలో ప్రతిష్ఠోత్సవాలు

మునుగోడు, ఫిబ్రవరి 11: మునుగోడులో నూతనంగా పునర్నిర్మించిన శ్రీభక్త మార్కండేయ ఆలయంలో ఆ స్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు నిర్వాహకులు ఆలయాన్ని అన్ని హంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మహోత్సవాల్లో తొలిరోజున ఉదయం సుప్రభాత సేవ, వేదపారాయణం, గ్రామదేవత ఆహ్వానం, గ్రామోత్సవం, కలశతీర్థం, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపనలతో రోజువారీగా కార్యక్రమాలను నిర్దేశించిన ప్రకారం నిర్వహించనున్నారు. 14వ తేదీన ఉదయం యంత్రస్థాపనలతో విగ్రహాలు, ధ్వజస్తంభ స్థాపన కళాన్యాసం, ప్రాణప్రతిష్ఠ, దేను దర్పణ, దర్శనాలు, బలిహరణం, మహాకుంభాభిషేకంలతో శివపార్వతుల శాంతికల్యాణం నిర్వహించనున్నారు. తీర్థప్రసాదాల వితరణ అనంతరం మధ్యాహ్నం సమయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ప్రతిష్ఠాపన చేసిన స్వాముల విగ్రహాలకు పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. చివరి రోజున శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

బండపాలెం గుట్టపై స్టీల్ రెయిలింగ్ ఏర్పాట్లు


బండపాలెం ఆలయ గుట్టపైకి రెయిలింగ్ చేస్తున్న కార్మికులు

కేతేపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని బండపాలెం గ్రామంలోని గుట్టపై గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం పైకి వెళ్లే మెట్ల మార్గంలో జరుగుతున్న స్టీల్ రెయిలింగ్ పనులను ఆదివారం ఆలయ చైర్మన్ మారం మీనారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోశం రామదాసు - మణెమ్మ దం పతుల సహకారంతో సుమారు రూ.2.50లక్షల వ్యయంతో రెయి లింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెయిలింగ్ పనులు పూర్తయితే రక్షణతో పాటు, ఆలయానికి కొత్త అందాలు సమకూరుతాయని పేర్కొన్నారు. మండలంలోనే ఈ సీతారాముల ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఈ ఆలయ రామయ్యను రెండు ఊర్ల రాముడిగా పిలుచుకుంటారు. ఈ ఆలయంలోని సీతారాములు సంవత్సరమంతా చందుపట్ల గ్రామంలో పూజలు అందుకుంటాడు. శ్రీ రామనవమి సందర్భంలో వారం రోజుల పాటు బండపాలెం గ్రామంలోని గుట్టపైన సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు.

రంగారెడ్డి ఆర్ఎల్‌సిగా పిట్టలగూడెం వాసి

గుర్రంపోడు, ఫిబ్రవరి 11: రంగారెడ్డి జిల్లా మైనార్టీ గురుకుల రీజనల్ లెవల్ కో ఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ)గా మండలంలోని పిట్టలగూడెం గ్రామానికి చెందిన నిమ్మల జితేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మైనార్టీ గురుకుల సంస్థ కార్యదర్శి అయేషామస్రత్ ఖానం ఉత్తర్వులు జారీ చేశారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా 2021లో మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్‌గా ఎంపికైన జితేందర్ ఆసిఫ్‌నగర్, బాలానగర్ బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆర్ఎల్‌సీగా పిట్టలగూడెం వాసి నియమితులవడంపై మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ సభను బహిష్కరించాలి

శాలిగౌరారం, ఫిబ్రవరి 11: కేసీఆర్ బహిరంగ సభను బహిష్కరణ చేయాలని ఆప్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తంరెడ్డి ప్రకటనలో పిలుపునిచ్చారు. కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని తొలిసారి ముఖ్యమంత్రిగా గెలిచాడని అన్నారు. పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి రెండోసారి సీఎంగా గెలిచిన అనంతరం నియంత పాలన సాగించాడని ఆయన విమర్శించారు.

ఎడవల్లి శివారులో పులి సంచారం?

● ఆచూకీ లభించలేదన్న ఫారెస్ట్ అధికారులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11: నార్కట్‌పల్లి మండలంలోని మాధవఎడవల్లి, పోతినేనిపల్లి గ్రామ శివారుల్లో పులి సంచరిస్తున్నట్లు సమాచారం. పోతినేనిపల్లి గ్రామానికి చెందిన ఆదిమల్ల వెంకన్న తన భార్యతో కలిసి శనివారం కారులో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి వెళ్లాడు. తిరిగి భార్యతో నార్కట్‌పల్లి మీదుగా కాకుండా కామినేని పక్కనే ఉన్న హెరిటేజ్ పాల ఉత్పత్తి సంస్థ ఎదురుగా గల స్పెక్ట్రా వెంచర్ నుంచి సాయంత్రం ఎడవల్లి మీదుగా పోతినేనిపల్లికి బయలుదేరాడు. ఎడవల్లి శివారుకు ఏపీ లింగోటం చెరువు సమీపానికి చేరుకోగానే 50మీటర్ల దూరంలో పులి ఆనవాళ్లు ఉన్న జంతువు నడుచుకుంటూ వెళ్లడాన్ని అతని భార్య చూసి భర్తను అప్రమత్తం చేసింది. పులివెళ్లిన అనంతరం ఈ విషయాన్ని ఆయన ఏపీ లింగోటం మాజీ సర్పంచ్ నూకల శంకర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఈ విషయాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి నూకల శంకర్ తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డికి ఫోన్ చేసి పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని, అటవీశాఖ సిబ్బందికి చెప్పాలని ఆదేశించారు. కాగా పులి సంచారంపై ప్రజలు, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని చేతిలో ఆయుధం, కర్రలు వెంట పె ట్టుకుని గుంపులుగా వెళ్లాలని ఆదివారం ఏపీ లింగోటంలో చాటింపు వేయించారు. ఈ విషయమై ఆదివారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లారెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భవాని పులి సం చరించిందన్న ప్రచారం జరిగిన పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టగా పులి సంచరించిన ఆనవాళ్లు లభించలేదని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు


సత్తయ్య(ఫైల్)

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11: సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలానికి చెందిన దండు సత్తయ్య నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో అదృశ్యమయ్యాడు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలానికి చెందిన దండు సత్తయ్య అనే వృద్ధుడికి కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. నార్కట్‌పల్లి మం డలంలోని చెర్వుగట్టు దేవస్థానంపై అమావాస్య రోజున నిద్ర చేస్తే మానసిక రుగ్మత నయమవుతుందనే విశ్వాసంతో ఈ నెల 9వ తేదీన కుటుంబసభ్యులతో ఇక్కడికి వచ్చారు. స్వామి దర్శనానంతరం నిద్రకు ఉపక్రమించిన కుటుంబసభ్యులు తెల్లవారుజామున లేచి చూడగా సత్తయ్య కనపడలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సత్తయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

అప్పులబాధతో యువకుడి బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 11: అప్పులబాధ తట్టుకోలేక ఓ యువకుడు బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన గడ్డం మహేష్ (24) తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి ఇంటికి వచ్చి చూసే వరకు తన కుమారుడు విగతజీవిగా మారడాన్ని చూసి బోరుమన్నారు. అవివాహితుడైన మహేష్ తన వ్యక్తిగత అవసరాల కోసం చేసిన అప్పులను తీర్చలేక మానసికంగా కుంగిపోయి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై తమకు ఎ లాంటి ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తిప్పర్తి, ఫిబ్రవరి 11: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం తిప్పర్తి మండల పరిధిలోని మల్లెపల్లివారిగూడెం వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గోగుల లక్ష్మయ్య జంగారెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు వద్ద స్థానికంగా ఉన్న కిరాణ దుకాణానికి వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. వాటిని తీసుకొని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్యకు కాలు, చేయి విరిగి, తలకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

కట్టంగూరు, ఫిబ్రవరి 11: ప్రమాదవశాత్తు గడ్డివాము, పూరి గుడిసె కొట్టం దగ్ధం కావడంతో సుమారు రూ. 30వేల విలువైన ఆస్తి నష్టం జరిగింది. మండలంలోని ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద ఎండిన పత్తి కర్రలకు నిప్పంటించారు. ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన గంగాదేవి యాదయ్య అనే గీత కార్మికుడి 5 ఎకరాల గడ్డివాము, పూరి గుడిసె దగ్ధమైంది. సుమారు రూ.30వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. పావనగుండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కనుకుల వెంకట్‌రెడ్డి రూ.5 వేలు గీత కార్మికుడికి అందజేశారు. కార్యక్రమంలో కొమ్మనబోయిన సైదులు, దొంతం వెంకట్‌రెడ్డి, రామలింగం, మధుసూదన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: డిండి ప్రాజెక్టు నీటిని కాలువల ద్వారా చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలోని చెరువులు, కుంటలకు తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలలో నీరు వట్టిపోయాయన్నారు. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డిండి ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపాలని కోరారు.

కట్టంగూరు: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు అన్నారు. సమ్మెకు అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గుడుగుంట్ల రామకృష్ణ, కంకణాల శోభరాణి, యాదమ్మ, మంగమ్మ, గణేష్, ఎల్లమ్మ, సరిత పాల్గొన్నారు.

హాలియా: హాలియా మునిసిపాలిటీలోని ఆదిత్య కేర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన వైద్య బృందం రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ల బృందం గుండెపోటు గురైన వ్యక్తికి సీపీఆర్ టెస్ట్ చేయడంపై రోగులకు అవగాహన కల్పించారు.

మర్రిగూడ: కృష్ణానది జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, దళితబంధు మాజీ కమిటీ సభ్యుడు లపంగి నర్సింహ, రైతుబంధు మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కృష్ణానది ప్రాజెక్టులను తమ ఆధీనంలోకి తీసుకోవడాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. 13న బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దేవరకొండ: సూర్యాపేట మండలం ఇమాంపేట సాంఘిక, సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో చదువుతున్న విద్యార్థిని వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వ సైకాలజికల్ కౌన్సిల్ సభ్యులను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

హాలియా: హాలియా నూతన ఎస్ఐగా సతీష్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన శోభన్‌బాబు దేవరకొండకు బదిలీపై వెళ్లగా నల్లగొండ వీఆర్ నుంచి సతీష్‌రెడ్డి హాలియాకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా నూతన ఎస్ఐ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

డిండి: డిండి ఎస్ఐగా బి.రాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నేరేడుగొమ్ము మండల ఎస్ఐగా పనిచేస్తున్న రాజు బదిలీపై డిండి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. డిండి ఎస్ఐగా పనిచేస్తున్న డి.సైదులు బదిలీపై దేవరకొండకు వెళ్లారు.

కట్టంగూరు: కట్టంగూరు నూతన ఎస్ఐగా ఎన్.శ్రీను ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రాజు బదిలీపై తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. నల్లగొండ సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎన్.శ్రీను కట్టంగూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

నార్కట్‌పల్లి: చెర్వుగట్టు స్వామి వారి బ్రహ్మోత్సవాల పత్రికను ఎమ్మెల్యే వేముల వీరేశానికి దేవస్థానం ఈవో సిరికొండ నవీన్‌కుమార్ అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహ అర్చకులు సతీష్‌శర్మ ఎమ్మెల్యే వీరేశానికి వేదాశీర్వచనం చేశారు

మునుగోడురూరల్: గావ్ చలో బస్తీ చలో పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో చీకటిమామిడి గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ప్రవాసీ కార్యకర్తగా బీజేపీ సీనియర్ నాయకుడు కర్నాటి లింగయ్య, బీజేవైఎం మండలాధ్యక్షుడు జీడిమెట్ల జానీ పాల్గొని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరుతూ ప్రజలకు వివరించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాదగోని నరేందర్‌గౌడ్, నాయకులు పెంబళ్ల జానయ్య, లింగస్వామి, వెంకటేశ్వర్లు, నర్సింహ, వెంకన్న పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకం : శ్రీనివాస్

మర్రిగూడ, ఫిబ్రవరి 11: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఆశాజనకంగా ఉందని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. మర్రిగూడలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై బడ్జెట్‌లో నిధులు కేటాయించారని అన్నారు. అదేవిధంగా డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాల బాధితులకు, భూనిరాస్వితులకు త్వరగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించి త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. శివన్నగూడెం రిజర్వాయర్ పూర్తి చేస్తే ఈ ప్రాజెక్టు కింద బీడు భూములకు లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకటయ్య, నాయకులు పగడాల లింగయ్య, పుప్పాల యాదయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి యువకుల ఆర్థికసాయం

డిండి, ఫిబ్రవరి 11: డిండి గ్రామ యువకులు మృతురాలి కుటుంబానికి రూ.10వేల నగదు ఆర్థిక సహాయం అందజేసి ఆదుకున్నారు. డిండి మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు సింగజోగి ముత్తమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామ యువకులు ఆమె కుమార్తె జ్యోతికి రూ.10వేల నగదు ఆర్థికసాయం అందజేశారు. గతేడాది మార్చిలో గ్రామానికి చెందిన 16 మంది యువకులు గ్రామంలో ఎవరు మృతి చెందినా ఆ కుటుంబానికి రూ.10వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని సంకల్పించారు. అప్పటి నుంచి నేటి వరకు 31 కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. గ్రూపులో 16 మంది సభ్యులుండగా నేటికి ఆ సంఖ్య 29కి చేరింది. కార్యక్రమంలో యువకులు బి.శైలేజ్, బి.శ్రీనివాస్‌గౌడ్, శ్రీపతిరావు, దినేష్, నూకం వెంకటేష్, లక్ష్మణ్, ఏటి కృష్ణ, మునగపాటి శ్రీను, ఎం.ఎ.కయూం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.